కారు 'చీకట్లు'!



ఎటుచూసినా కారుచీకట్లే. పట్టణాలు, గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రయ్యేసరికి అంధకారంలో ఉన్న రహదారులు, వీధుల్లో తిరిగేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనే 4వేలకు పైగా వీధిదీపాలు వెలగడం లేదని గుర్తించారు. వాస్తవంలో ఇంకా ఎక్కువ ఉండొచ్చు. నాడు టీడీపీ పాలనలో ఎల్ఈడీ లైట్లు సరఫరా చేసి నిర్వహణను ఆర్టీజీఎస్(రియల్‌టైమ్ గవర్నెన్స్) ద్వారా పర్యవేక్షించేవారు. గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. స్థానిక సంస్థల నిధులు కూడా లాగేసుకుని ఏం చేయలేని పరిస్థితిని కల్పించారు. దీనివల్ల వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చేయాలన్న కూటమి ప్రభుత్వం సంకల్పానికి అడ్డంకులు తప్పడం లేదు.

- » పట్టణాలు, పల్లెల్లో వెలగని వీధిలైట్లు
- » మరమ్మతులపై కొరవడిన శ్రద్ధ
- » వీధిలైట్ల పనితీరుపై ప్రభుత్వం సర్వే
- » జిల్లావ్యాప్తంగా 4వేల వీధిలైట్లు వెలగడం లేదని గుర్తింపు
- » నిర్వహణ పేరుతో లక్షల్లో ఖర్చు
- » అప్పటి టీడీపీ పాలనలో ఎల్ఈడీ లైట్లు సరఫరా.. ఆర్టీజీఎస్ పర్యవేక్షణ
- » గత వైసీపీ పాలనలో గాలికి..
- » అంధకారంలో ప్రజల అవస్థలు



కాకినాడ నగరంలో వెలగని వీధిలైట్లు

పిఠాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాకినాడతోపాటు పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, తుని, గొల్లప్రోలు, ఏలేశ్వరం పట్టణాలతోపాటు 20 మండలాల పరిధిలోని 385 గ్రామ పంచాయతీల పరిధిలో వీధిదీపాల నిర్వహణ గాడితప్పింది. దీనివల్ల పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. నగరాలు, పట్టణాల్లోని ప్రధాన రహదారుల్లోని వీధి దీపాలే సక్రమంగా వెలగడం లేదు. గ్రామాల్లోను అదే పరిస్థితి. రాత్రయ్యేసరికి గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులు, వీధులు అంధకారంలో చిక్కుకుంటున్నాయి. దీంతో రాత్రి పూట బయటకు వచ్చినవారు బిక్కుబిక్కుమంటూ ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోంది.



గొల్లప్రోలు శివాలయం వీధిలో వెలగని వీధిలైటు

టీడీపీ హయాంలో ఎల్ఈడీ వీధిదీపాలు

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణపై దృష్టిపెట్టింది. అప్పటివరకూ గ్రామాల్లో సాధారణ ట్యూబ్‌లైట్లు, ఒకటి, రెండు ప్రాంతాల్లో మెర్క్యూరీ లైట్లను, పట్టణాలు, నగరాల్లో మెర్క్యూరీ లైట్లు, సోడియం వేపర్ లైట్లను వీధిదీపాలుగా వినియోగించారు. వీటి వినియోగంవల్ల స్థానిక సంస్థలపై విద్యుత్‌బిల్లుల రూపేణా భారం అధికంగా పడేది. మేజర్(నోటిఫైడ్) పంచాయతీలు,నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ నిధుల్లో సింహభాగం, ఇతరత్రా గ్రాంట్లలో ఎక్కువ మొత్తాలు విద్యుత్ బిల్లులు చెల్లించడానికే సరిపోయేవి. దీనిపై దృష్టిపెట్టిన అప్పటి టీడీపీ సర్కారు వీధి లైట్లను మార్చివేయాలని నిర్ణయం తీసుకుంది. నెడ్‌క్యాప్, ఈఈఎస్ఎల్ ద్వారా ఎల్ఈడీ వీధిలైట్లను సరఫరా చేసింది. నిర్వహణ బాధ్యతను వారికే అప్పగించింది. నిర్వహణ ఖర్చులను పంచాయతీలను భరించాలని సూచించింది. 2016లో వీటిని ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్‌బిల్లుల భారం గతంలో కంటే 50శాతానికిపైగా తగ్గింది. దీంతో పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలపై ఆర్థికభారం తప్పింది.

ఆర్టీజీఎస్ ద్వారా..

2016లో ఎల్ఈడీ వీధి దీపాలు వేసిన తర్వాత వీటిని రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షించే ఏర్పాటుచేశారు. అమరావతి నుంచి ఎప్పటికప్పుడు ఎక్కడెక్కడ వీధిలైట్లు వెలుగుతున్నాయి, వెలగడంలేదో గమనించి ఆదేశాలిచ్చేవారు. స్వయంగా సీఎం చంద్రబాబు పర్యవేక్షించడంతోపాటు అక్కడ పరిస్థితిని పరిశీలించి తగు సూచనలు ఇవ్వడంతో నూరుశాతం వీధిలైట్లు వెలిగే పరిస్థితి ఉండేది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీధిలైట్ల నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. నిర్వహణ సంస్థలకు సక్రమంగా నిధులు చెల్లించకపోవడం, స్థానిక సంస్థలకు వచ్చే నిధులను వివిధ రూపాల్లో ప్రభుత్వం దారి మళ్లించడంతో పరిస్థితి దయనీయంగా మారింది. వీధిలైట్ల నిర్వహణను ఆర్టీజీఎస్ ద్వారా పర్యవేక్షించే ఏర్పాటుకు మంగళం పాడేశారు. దీనివల్ల గ్రామాలు, పురపాలక సంఘాల్లో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీధిలైట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించింది.

పరిస్థితిపై సర్వే

రాష్ట్రవ్యాప్తంగా వీధిలైట్ల నిర్వహణపై ప్రభుత్వం సర్వే జరిపించింది. ఇందులో జిల్లాలోని కాకినాడ నగరంతోపాటు నాలుగు మునిసిపాలిటీలు, రెండు నగర పంచాయతీలు, 385 గ్రామ పంచాయతీల్లో సర్వే జరిపించింది. ఇందులో 4వేల వీధిదీపాలు వెలగడం లేదని వెల్లడైంది. పలు చోట్ల అవసరమున్నా వీధిలైట్లు ఏర్పాటు చేయలేదని గుర్తించింది. వాస్తవంలో ఈ సంఖ్య రెట్టింపు కంటే అధికంగానే ఉంటుంది. వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా లేని విషయం సర్వే ద్వారా వెల్లడి కావడంతో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. 2014-19లో అమలు చేసిన విధానంలో తిరిగి అమలు చేయాలా లేక కొత్త పద్ధతి తీసుకురావాలా అనే అంశంపై చర్చ జరుగుతోంది. కొద్దిరోజుల్లోనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నగరాలు, పట్టణాల్లో వీధిలైట్ల నిర్వహణను అక్కడి స్థానిక సంస్థలకే పూర్తిస్థాయిలో అప్పగించాలని, అవసరమైతే కేంద్రీకృతంగా ఒక సంస్థకు అప్పగించి పర్యవేక్షణ బాధ్యతను వారికే వదిలివేయాలని భావిస్తున్నామని చెబుతున్నారు. పంచాయతీల్లో వీధిలైట్ల ఏర్పాటుతోపాటు నిర్వహణ బాధ్యత, ఖర్చును ప్రభుత్వమే చూడాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు కూడా దీనిపై సమీక్ష చేశారు. అయినా దీనిపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేనట్టు సమాచారం. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు వచ్చిన నేపథ్యంలో పలు గ్రామాల్లో వీధిలైట్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. నిధులు ఎక్కువగా ఉండే నోటిఫైడ్ పంచాయతీల్లో ఇప్పటికే మరమ్మతులు జరుగుతుండగా మిగిలిన చోట్ల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గ్రామాలు, పట్టణ, నగర వీధుల్లో అంధకారం లేకుండా వీధిలైట్లు అన్ని సక్రమంగా వెలిగేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

భ్రూణ హత్యల నివారణపై దృష్టి కేంద్రీకరించాలి

» కలెక్టర్ షాన్ మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆడశిశువుల పట్ల వివక్షత జరిగే ప్రాంతాల్లో భ్రూణ హత్యలను నివారించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశుసంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. గుర్తింపు పొందిన 153 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, ఇన్‌చార్జ్ డీఎం హెచ్‌వో రమేష్, డీఐవో సుబ్బరాజు, డీసీ హెచ్‌ఎస్ స్వప్న పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

» కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధశాఖల జిల్లా అధికారులతో జిల్లా రహదారి భద్రతపై శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరంలో రోడ్లు, ప్యాచ్‌వర్క్ మరమ్మతులు చేయడానికి అంచనాలు తయారు చేసి పంపించాలన్నారు. ట్రాఫిక్ రద్దీ ఉండే కల్పనాసెంటర్, జగన్నాథపురం బ్రిడ్జి, పీఆర్ ప్రభుత్వ కళాశాల రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ బోర్డులు, వన్‌వే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో దీపాలు లేని సెంటర్లలో కాషన్ లైట్లు, హైమాస్ట్ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌హెచ్ 216పై కత్తిపూడి కాకినాడ మధ్య ఉన్న రోడ్డుపై గోతులకు మరమ్మతులు చేయాలన్నారు. డీటీసీ శ్రీధర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతు, ఇన్‌చార్జిడీఎంహెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి ఐక్యంగా పనిచేయాలి

» కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలల సంక్షేమానికి ఐక్యంగా చేయాలని,బాల్యవివాహాలు, బాలకార్మికుల నియంత్రణకు కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం మిషన్ వాత్సల్య త్రైమాసిక బాలల సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ భిక్షాటనలో ఉన్న బాలలు, బడి బయట బాలలు, బాలలపై వేధింపుల నివారణకు కలిసికట్టుగా అధికారులు పనిచేయాలన్నారు. 18ఏళ్లలోపు బాలలకోసం మిషన్ వాత్సల్య పథకం ద్వారా వివిధ పథకాలను అందించాలన్నారు. తల్లిదండ్రులు లేని అనాథలకు స్పాన్సర్‌షిప్ పథకం కింద రూ.4వేలు అందజేయాలన్నారు. స్త్రీ, శిశు గృహ ద్వారా పిల్లలు లేని వారికి పిల్లలను దత్తత ఇవ్వాలన్నారు. మానసిక దివ్యాంగులైన బాలల కోసం సంరక్షణ గృహాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మూడో అదనపు సెషన్ జడ్జి కమలాదేవి, స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండా ప్రవీణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటరావు పాల్గొన్నారు.

తెల్ల రేషన్‌కార్డుదారులకు.. ఉచిత గ్యాస్

- » ఆధార్ అనుసంధానమై ఉండాలి
- » జిల్లాలో 6లక్షలమందికి లబ్ధి



కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్‌కార్డు కల్గిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి మూడుగ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. తెల్ల రేషన్‌కార్డు కల్గిఉండి ఆధార్ అనుసంధానమై ఉండాలని నిబంధన పెట్టింది. యాక్టివ్ ఎల్‌పీజీ గ్యాస్‌కనెక్షన్ కల్గి ఉన్నవారు ఉచితంగా గ్యాస్‌సిలిండర్ పొందేందుకు అర్హులు. జిల్లాలో 6లక్షలకుపైగా తెల్లరేషన్‌కార్డులున్నాయి. వీరిలో ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కల్గి ఉన్నవారు దీపావళి పండుగనుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్ పొందనున్నారు. ఈనెల 29న గ్యాస్ బుకింగ్ చేసుకుంటే ఈ నెల 31న దీపావళి రోజున డెలివరీ చేసేలా కార్యాచరణ రూపొందించారు. తొలి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను ఈనెల 30 నుంచి వచ్చే ఏడాది మార్చి 31లోపు పొందాలని ప్రభుత్వం సూచించింది. రెండోది వచ్చేఏడాది ఏప్రిల్ 1నుంచి జూలై 31లోపు బుకింగ్ చేసుకోవాలని పేర్కొంది. మూడోది వచ్చే ఏడాది ఆగస్టు 1 నుంచి నవంబరు 31లోపు పొందాలంది. ఈనేపథ్యంలో తెల్లరేషన్‌కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువుల లెక్క.. పక్కాగా



- » జిల్లాలో ప్రారంభమైన పశుగణన
- » ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ రూపంలో లెక్కింపు
- » నాలుగునెలలపాటు ప్రక్రియ

ప్రస్తుతం జిల్లాలో పశువుల వివరాలు

ఆవులు..	76,502
గేదెలు..	2,82,273
పాలు ఇచ్చే పశువులు..	2,26,715
గొర్రెలు..	1,41,229
మేకలు..	1,01,870
పందులు..	4,394
కోళ్లు..	92,48,636

పెద్దాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పశుగణన కార్యక్రమం ఈనెల 25నుంచి ప్రారంభమైంది. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి జిల్లా యూనిట్‌గా పశుగణనను కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. ఈ గణాంకాల ఆధారంగా పశు అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేస్తారు. పశువుల అంటే సాధారణంగా అందరూ అనుకునేది గేదెలు, ఆవులే కాకుండా ఈసారి మరికొన్నింటిని ఇందులో చేర్చారు. ప్రతిఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పశుగణన దేశంలో ఇప్పటివరకు 20సార్లు జరిగింది. 20వ పశుగణన 2019లో జరగ్గా 21వ పశుగణన ఈనెల 25నుంచీ ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకూ సాగనుంది. పశు సంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశుసంపదను లెక్కిస్తారు. మొత్తం 16 కేటగిరీల్లో వివరాలను సేకరిస్తారు. కేంద్రపశుగణాభివృద్ధిశాఖ మంత్రి రాజీవ్ రతన్‌సింగ్ ఢిల్లీలో ఈ ప్రక్రియను ప్రారంభించగా దేశవ్యాప్తంగాను మొదలుపెట్టారు.

350మందితో పశుగణన..

పశుగణనను ముందు గతనెల 1 నుంచి చేపట్టాలని భావించినా పలు కారణాలతో వాయిదా పడింది. ప్రస్తుతం దాన్ని చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పశుగణనకోసం 350మంది సిబ్బంది పనిచేయనున్నారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ఒక నోడల్‌అధికారి వ్యవహరించనున్నారు. మొత్తం 54మంది పశువైద్యులు, ఇతర అధికారులు సూపర్‌వైజర్లుగా ఉంటారు. వారి పర్యవేక్షణలో 296మంది గ్రామస్థాయి వెటర్నరీ అసిస్టెంట్లు వెటర్నరీ ఆస్పత్రుల్లోని పారాసిబ్బంది క్షేత్రస్థాయిలో గణన చేయనున్నారు. పట్టణం, గ్రామీణం తేడా లేకుండా అన్నీ ప్రాంతాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశుసంపద వివరాలను సేకరిస్తారు. గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్లతోపాటు ఉంటే గుర్రాలు మొదలైన వంటి 16 రకాల కేటగిరీలకు చెందిన వాటి వివరాలను సేకరిస్తారు. అన్ని ఇళ్లకు వెళ్లి అక్కడఉన్న పశువుల వివరాలు సేకరించే సిబ్బంది పశుసంపద లేకపోతే ఆ విషయాన్ని కూడా నమోదు చేస్తారు. అలా ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈసారి పశుగణన ప్రక్రియ మొత్తం డిజిటల్ చేయన్నారు. ఒకసారి యాప్‌లో వివరాలు నమోదు చేసేందుకు సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు భాగస్వామ్యంతో రూపొందించిన యాప్ ఆధారంగా పశుగణన నిర్వహించనున్నారు. సంకరజాతి, దేశీయజాతి పశుసంపదను వేర్వేరుగా సేకరించనున్నారు. మొత్తంగా 71 విభాగాల్లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా పశుగణన చేపడతాం

పశుగణనను పారదర్శకంగా చేపడతాం. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గణన నిర్వహించే ఎన్యూమరేటర్లు ఈ ప్రక్రియ పర్యవేక్షించే సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈసారి మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయనున్నారు. పశుగణనకు ప్రజలు, రైతులు, పెంపకందార్లు సమగ్ర సమాచారాన్ని సిబ్బందికి అందించాలి.

-డాక్టర్ గిరీష్, పశుగణన జిల్లా నోడల్ అధికారి, కాకినాడ

జిల్లాలో ప్రారంభమైన పశుగణన ప్రక్రియ: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి అఖిల భారత పశుగణన ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగణన ప్రక్రియను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ సిబ్బంది జిల్లాలో ప్రతిఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ శాఖకు సంబంధించి వికసిత్ ఆంధ్ర ప్రణాళిక రూపకల్పనకు ఈ పశుగణన ఉపయోగపడుతుందన్నారు. ఈ గణన భారతదేశమంతా ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరుగుతుందన్నారు. గేదెలు, ఆవులు,గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, పోనీస్‌గాడిదలు, కంచరగాడిదలు, ఒంటెలు, ఏనుగులు, శునకాలు, కుందేళ్లు, పక్షిజాతులైన కోళ్లు, బాతులు, టర్కీకోళ్లు, పెంపుడు జంతువుల వివరాలు నమోదు చేస్తారన్నారు. దీనికి సిబ్బందిని నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. 21వ అఖిల భారత పశుగణన ప్రక్రియపై రూపొందించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, డీడీలు కృష్ణమూర్తి, నిర్మల,దినకర్, గిరీష్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్టీసీల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. అతిథులుగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ, అసోసియేట్ రాష్ట్ర నాయకురాలు జి.మంగతాయారు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఈజే మోహనరావు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ఎస్‌మూర్తి, ఉపాధ్యక్షుడు జి.విజయ్‌కుమార్, ఎం.ముక్తేశ్వరరావు, కోశాధికారిగా కె.శ్రీనుకుమార్, సహాయ కార్యదర్శులు సౌజన్య, పద్మతోపాటు కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారంచేశారు. కాకినాడ యూనిట్ అధ్యక్షుడిగా నరసింహరావు, కార్యదర్శిగా శంకరరావు, కోశాధికారిగా శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు.

భార్యభర్తల తగువు కేసుల పరిష్కారానికి.. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు

- » ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- » ప్రత్తిపాడు, తునిరూరల్ పోలీస్‌స్టేషన్లలో తనిఖీలు

ప్రత్తిపాడు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల తగువు కేసులు విపరీతంగా పెరగడం వల్ల వీటిపరిష్కారానికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు ప్రతిపాదిస్తున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల భార్యాభర్తల తగాదాల కేసులు నమోదు అధికమైందన్నారు. వీటి పరిష్కారానికి డివిజన్ స్థాయిలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటుకు యోచిస్తున్నామన్నారు. ఇక్కడ భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. 16వ నెంబరు జాతీయ రహదారి వెంబడి ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. గంజాయి రవాణా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఆంధ్రా, ఒడిశా బోర్డర్, ఏజె న్సీ జిల్లాల నుంచి మోటార్ సైకిళ్లపై గంజాయి రవాణాకు కొందరు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు, స్టేషన్ పరిసరాలను, గ్రీవెన్స్ వినతులను పరిశీలించారు. సమీక్షల్లో ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం ఉన్నారు.

తునిరూరల్‌సర్కిల్ ఆఫీసులో తనిఖీలు

తుని రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ పోలీస్ సర్కిల్ ఆఫీసులో ఏలూరు రేంజ్ ఐజీ తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించి కొన్ని కీలక కేసులపై ఆరా తీశారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, గంజాయి విక్రయాలపై ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి సర్కిల్ పరిధి పోలీస్‌అధికారులతో సమీక్షించారు. తుని రూరల్ సర్కిల్‌పరిధిలో హైవేను ఆనుకుని ఉన్న ప్రధాన కూడలిలో సిగ్నల్‌వ్యవస్థను ఏర్పాటుకు చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు.



ప్రత్తిపాడులో రికార్డులు పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

నిధుల మంజూరుకు ఓకే

» జిల్లా పరిధిలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్: ఎంపీ ఉదయ్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంట్ పరిధిలో పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకారం తెలిపిందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలను విడుదల చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రి వర్గంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లాలో కాకినాడ, తుని, సామర్లకోట రైల్వేస్టేషన్లను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నారన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వేప్రాజెక్టులు, రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రధాని మోదీ, రైల్వేశాఖమంత్రి అశ్వనివైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి కేంద్రం నిధులుమంజూరు చేసిందన్నారు. రాజధాని అమరావతికి రూ.2275కోట్లతో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయడం శుభపరిణామమన్నారు. ఈ నిర్ణయాలతో రాష్ట్ర రాజధాని శరవేగంగా అభివృద్ధి చెందడంతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతుందన్నారు.

రోడ్డెక్కిన రైతుబజార్ రైతులు

» ఈవో ఆఫీస్ వద్ద ధర్నా

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌వద్ద ఉన్న రైతుబజార్‌లో సభ్యత్వం ఉన్న రైతులు ఇటీవల ఐదుగురు మరణించారు. వారి కుటుంబీకులు వాటిని తమకు డిమాండ్ చేయడంతో ఇద్దరికి షాపులను రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్లు కేటాయించారు. దీనిపై టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని గత వైసీపీ ప్రభుత్వంలో ఏలుబడి చేసిన రైతులకు మద్దతు తెలపడంపై ఆగ్రహానికి గురైన రైతులు కూరగాయాలు రోడ్డుపై వేసి నిరసన తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని, రైతుబజార్‌ను రాజకీయ కేంద్రంగా తయారు చేయవద్దని ప్లకార్డులతో నిరసన తెలిపారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. కార్నర్ షాపులు కొంతమందికి ఇవ్వడం తగదని, వాటిని కూడా డ్రా తీయాలంటూ రైతులు పట్టుబట్టారు. మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి వరకు కూరగాయలు విక్రయించకుండా రైతులు ధర్నా చేశారు. సాయంత్రానికి అక్కడికి చేరుకున్న ఏడీ నాగేశ్వరరావు ఎస్టేట్ ఆఫీసర్లను విచారించారు. గురువారం రైతుబజార్‌లో రైతుల మధ్య జరిగిన ఘర్షణ తన దృష్టికి తీసుకురాకపోవడంపై వారిపై మండిపడ్డారు. శనివారానికి నిరసన విరమించుకోకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని ఆదేశాలు ఇచ్చారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ

కాకినాడ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు విచారణ జరిపారు. ఈ విచారణను గోప్యంగా ఉంచడంతోపాటు లోపలికి మీడియాను అనుమతించలేదు. 2020, జనవరి 10న కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు, దస్తావేజు లేఖర్లు, ఆఫీసులో పనిచేసే ప్రైవేట్ వ్యక్తులనుంచి రూ.లక్ష వరకు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందులోభాగంగా నాలుగేళ్ల తర్వాత ఏసీబీ అధికారులు ఇప్పుడు విచారణ జరిపారు. అప్పటి సబ్‌రిజిస్ట్రార్‌లు కేవీఎస్ కుమారి, ఎస్.శేఖరబాబు, అప్పటి ఉద్యోగులు, దస్తావేజులేఖర్లను విచారించారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు మాట్లాడుతూ 2020లో జరిగిన ఏసీబీ దాడులకు సంబంధించి విచారణ చేపట్టారని తెలిపారు.



ఆహారమే.. ఆరోగ్యం!

మనుషుల జీవన విధానంలో ఎప్పటికప్పుడు మార్పులొస్తుంటాయి. అలవాట్లు, ఆహారం విషయాలు అనేక మార్పులు చేర్పులకు ప్రభావితం అవుతుంటాయి. ఆహారంపై నవీన పద్ధతులను అనుసరించేవారు ఓవైపు, ఆధునిక జీవనంలో కూడా ఆరోగ్యమే ప్రధానంగా చక్కటి ఆహారపు నియమాలతో కొనసాగేవారు మరొకవైపు కనిపిస్తారు. ముఖ్యంగా కొవిడ్ తర్వాత వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చాలా మందికి పెరిగింది. దైనందిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించే విధానాలకు ఎంతో మంది ఆకర్షితులవుతున్నారు. రోజూ నడక, వ్యాయామంతోపాటు మంచి ఆహారాన్ని పొందడమూ చాలా ముఖ్యమని భావిస్తున్నారు. దానికి అనుగుణంగానే సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహారాన్ని స్వీకరించే వారి సంఖ్యా పెరుగుతోంది. దాంతో పొద్దుటే మార్నింగ్ వాక్ చేసే పార్కుల వద్దే రాగి జావ, జొన్న జావా, కొర్రల జావా, రాగి సంగటి ఇలా ఆరోగ్యకర ఆహారాన్ని విక్రయిస్తున్నారు. అలాగే చిరు, తృణధాన్యాలతో చేసిన మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, పొట్టిక్కలు వంటి ఎన్నో రకాల అల్పాహారాల అమ్మకాలు సైతం జోరుగా సాగుతున్నాయి. ఇక జ్యూస్‌ల సంగతి.. ఇది వరకు పండ్ల రసాల జ్యూస్‌లు, లస్సీలు ఆరోగ్యం కోసమంటూ తాగేవారు. ఇటీవల కూరగాయలతో జ్యూస్‌ల వినియోగం బాగా పెరిగింది. ఆస్పత్రుల సమీపంలో కాకరకాయ జ్యూస్ స్పెషల్ అనో, బూడిదగుమ్మడి జ్యూస్ తమ ప్రత్యేకత అనో బోర్డులు కనిపిస్తున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. మంచి ఆహారమే మంచి ఆరోగ్యం అన్నది నేటి ట్రెండ్..







ఉదయాన్నే జావతో మొదలు.. ఆకలేస్తే మిల్లెట్ ఇడ్లీ.. వెజిటబుల్ జ్యూస్‌లు.. పెరుగుతున్న ఆరోగ్య స్పృహ

జావ తాగేద్దాం.. మొలకలూ లాగిద్దాం!





గోదావరి గట్టున వాకింగ్‌కు వచ్చిన వారికి రాగి, కొర్రలు తదితర జావలను విక్రయిస్తున్న దృశ్యం

తెలతెల్లవారుతుండగా.. అలా వాకింగ్‌కి వెళ్లి.. సూర్యోదయం కావొస్తున్న వేళ వేడి వేడి రాగి జావ తాగేవారు లక్షల్లో ఉంటారు. ఇవాళ ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుండడంతో రాగి జావకు యమగిరాకీ పెరిగింది. అందులోనూ తక్కువ ఖర్చుతో సిద్ధమైపోతుంది. ఈ అవకాశాన్ని యువకులు ఒడిసి పట్టుకొని.. ఉదయం వేళ పట్టుమని ఓ నాలుగు గంటలు కేటాయించి జనాలకు ఆరోగ్యమిస్తూ.. ఇటు వీళ్లూ ఉపాధి పొందుతున్నారు. రాగి ముద్ద, రాగి ఇడ్లీ, రాగి దోసెలు, రాగి లడ్డు వంటివి కూడా ఈ మధ్య విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. వీటిలో రాగి జావ తీరే వేరు. వాస్తవానికి చిరు ధాన్యాలను సిరి ధాన్యాలుగా పిలుస్తారు. అవి ఆరోగ్యానికి చేసే మేలు అపారమని వైద్యులూ చెబుతుంటారు. ఈ మధ్య ఆహారంలో కూడా చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు ప్రధానంగా మారిపోయాయి. ఆ సిరి ధాన్యాల్లో రాగులను రారాజుగా చెప్పవచ్చు. వీటినే ఫింగర్ మిల్లెట్స్ అంటారు. ఈ తరం వాళ్లకు తెలియకపోవచ్చుగానీ ఒకప్పుడు రాగి మాల్ట్‌ని పిల్లలు ఇష్టంగా తాగేవాళ్లు. తర్వాత రసాయన సమ్మేళనాలతో వచ్చే పొడుల రుచికి అలవాటుపడిపోయారు. ఇప్పుడు మళ్లీ రాగి మాల్ట్ ట్రెండ్ ఉరకలు పెడుతోంది. రోడ్డు పక్కన చిన్న బడ్డీల్లో రాగి జావను ఉదయంపూట విక్రయిస్తున్నారు. తక్కువ స్థలం, తక్కువ పెట్టుబడి, ఎక్కువ ప్రయోజనకరంకావడంతో యువత ఇటువైపు మళ్లుతోంది.

రాగి పిండి తక్కువ ధరకే దొరకడం, స్పూను పిండితోనే సుమారు అర లీటరు రాగి జావ తయారుకావడంతో పావులీటరు గ్లాసు రూ.10కే అందుబాటులోకి వచ్చింది. దీనికి మజ్జిగ, జీలకర్ర పొడి, మిరియాల పొడి, నిమ్మ రసం కూడా జత చేస్తూ రుచిని రెట్టింపు చేస్తున్నారు. కొన్నిచోట్ల రాగిజావతోపాటు జొన్న జావ, కొర్రల జావ, రాగి సంకటి వెజిటబుల్ సూప్, మొలకెత్తిన పెసలు, ఉడకబెట్టిన సెనగలు, స్వీట్‌కార్న్, కీర బీట్‌రూట్ క్యారెట్, కాకర ముక్కలు, నానబెట్టిన బాదం గింజలు, ఉడకబెట్టిన గుడ్లు, రాగి తోపా, చిమిలి వంటివీ విక్రయిస్తున్నారు. వీటి ధర కూడా రూ.10 మాత్రమే. అవన్నీ కూడా శరీరానికి మరింత మేలు చేసేవేకావడంతో లొట్ట లేసుకొని తాగడంతోపాటు ఇళ్లకూ పార్సిల్ తీసుకెళ్తున్నారు. నిజానికి రాగి జావను సూపర్ ఫుడ్‌గా చెబుతారు. రాగి జావలో ప్రధానంగా 'ఎలుసినియన్' అనే ప్రొటీన్ ఉంటుంది. దీనికి జీవ ప్రక్రియలో అధిక ప్రాధాన్యం ఉంది. ప్రొటీన్, కార్బొహైడ్రేడ్స్, ఖనిజ లవణాలు, ఈ, సీ విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, కొవ్వులు, ఫైబర్, బీ కాంప్లెక్స్, థయమిన్, నియాసిన్, రిబోఫ్లేవిన్‌ని శరీరం పొందుతుంది. రాగిపిండి సహజ ఐరన్ కూడా. కాల్షియం, ఇనుము ఎముకలను బలోపేతం చేస్తాయి. రక్తంలో హిమోగ్లొబిన్ స్థాయిలను పెంచుతుంది. బీపీ హద్దుల్లో ఉంటుంది. రాగి జావలో ఉండే మెగ్నీషియం, డైటరీ ఫైబర్, పాలీఫినాల్స్ వంటివి రక్తంలోని గ్లూకోజ్‌ని నియంత్రించడం వల్ల షుగర్‌తో బాధపడే వాళ్లకు మేలు కలుగుతుంది. అధిక బరువును తగ్గించుకోవచ్చు. కాలేయ వ్యాధులు దూరమవుతాయి. జీర్ణక్రియకు రాగులు దోహద పడతాయి. **- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి**



మిల్లెట్ ఇడ్లీ, పొట్టిక్కలు..

చిరు, తృణధాన్యాలతో చేసిన అల్పాహారానికి కూడా మార్కెట్‌లో చాలా గిరాకీ పెరిగింది. ఇదివరకు వాకింగ్‌కు వెళ్లేవారు, క్రీడాకారులు, జిమ్‌లకు వెళ్లేవారు మాత్రమే వీటివైపు చూసేవారు. ఇప్పుడు చాలా మంది మిల్లెట్ ఇడ్లీ, తృణధాన్యాలతో చేసిన అల్పాహారాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. దాంతో అయా అల్పాహారాలు అందించే దుకాణాలు సైతం విరివిగా పెరిగాయి. చిరుధాన్యాలతో దాదాపుగా అన్ని రకాల ఆహారాన్ని తయారుచేసే విధానం కూడా బాగా పెరిగింది. ఇళ్ల దగ్గరకన్నా మార్కెట్‌లో సులువుగా దొరుకుతుండడంతో ఈ బిజినెస్ పెరిగింది.

ఆరోగ్యం కోసం వెజిటబుల్ జ్యూస్

కొందరు ఫాస్ట్‌ఫుడ్లకు అలవాటు పడుతుంటే, మరికొందరు మంచి ఆరోగ్యానిచ్చే ఆహారాన్ని స్వీకరిస్తున్నారు. వైద్యులు కూడా ఫాస్ట్‌ఫుడ్లు మాని కూరగాయలు, ఆకుకూరలు తినమని సలహా ఇస్తున్నారు. కొవిడ్ తర్వాత చాలామంది విటమిన్స్ కలిగిన ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆకుకూరలు, కూరగాయలు జ్యూస్‌లు తాగడం మొదలెట్టారు. దీంతో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా వెజిటబుల్ జ్యూస్ సెంటర్లు వెలిశాయి. అనారోగ్యకరమైన ఆహారం, బిజీ లైఫ్‌స్టైల్ కారణంగా రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతోంది. ఇది గుండె ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని, సమతుల్య ఆహారం పాటించాలని, ఇంట్లో తయారుచేసిన కూరగాయల రసం తాగాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. ప్రకృతిలో లభించే ఆకుకూరలు, కూరగాయల్లో ఆరోగ్యానికి మేలు చేసే వివిధ రకాల గుణాలుంటాయి. కూరల్లానే కాకుండా.. జ్యూస్ రూపంలో తీసుకున్నా అద్భుత ప్రయోజనాలు చేకూరుతాయి. దీంతో ఈ వ్యాపారం జోరుందుకుంది. పార్కులు, క్రీడాస్థలాలు, ఆసుపత్రుల వద్ద వీటి అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక ఏ కూరగాయ రసం దేనికి ఉపయోగపడుతుందో చూద్దాం.

బీట్‌రూట్ : బీట్‌రూట్ రసంతో కంటిచూపు మెరుగుపడుతుంది. అజీర్తి, పెప్టిక్ అల్సర్, కడుపునొప్పి సమస్యలకు మంచి పరిష్కారం. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే బీట్‌రూట్‌కు మించింది మరొకటి లేదు.

కారెట్ జ్యూస్ : కారెట్ జ్యూస్‌లో అధికంగా ఉండే విటమిన్ ఏ కంటికి మంచిది. కేన్సర్ కణాల్ని నిరోధించే గుణం కారెట్‌లో ఉంది. కొలెస్ట్రాల్‌వంటి సమస్యలున్నవారికీ మంచిది.

కీర, దోసకాయ జ్యూస్ : కీరా లేదా దోసకాయ జ్యూస్‌తో అన్ని రకాల కడుపు సంబంధిత సమస్యలు దూరమవుతాయి. దోసకాయ ఒంటికి చలువ కలిగిస్తుందని చెబుతున్నారు.

బూడిద గుమ్మడి జ్యూస్: ఈ జ్యూస్ క్రమం తప్పకుండా తీసుకుంటే.. కిడ్నీలో రాళ్ల సమస్య, స్త్రీలలో రుతు సమస్య, అధిక రక్తస్రావం, మలబద్ధకం, ఎసిడిటీ వంటివి దూరమవుతాయి.

అలొవెర ఉపయోగాలు : వేడి తగ్గించడం, పైల్స్ తగ్గించడంతోపాటు రాకుండా ఉండటానికి, మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం.

గోధుమగడ్డి జ్యూస్: రక్తసిద్ధి, కొలెస్ట్రాల్, బ్లడ్ ప్రెజర్ చర్మవ్యాధులు, మధుమేహం, రోగనిరోధకశక్తికి ఉపయోగపడుతుంది.

ఉసిరి జ్యూస్: కాలేయ సమస్య ఉంటే ఉసిరి రసాన్ని తయారుచేసి తేనెతో కలిపి తినాలి. ఇది కాలేయాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. జాండిస్‌తో బాధపడుతున్న వారికి ఉపశమనం కలుగుతుంది. ఖాళీ కడుపుతో ఉసిరికాయ రసం తాగడం వల్ల త్వరగా బరువు తగ్గవచ్చు.

పాలకూర జ్యూస్: రక్తపోటును నియంత్రిస్తుంది. పాలకూర నీటిలో సహజంగా లభించే నైట్రేట్‌లు అధికంగా ఉంటాయి. రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడే ఒక రకమైన సమ్మేళనం, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తప్రసరణను పెంచుతుంది. గుండె సంబంధిత వ్యాధులను నివారిస్తుంది.

కాకరకాయ జ్యూస్: ఈ జ్యూస్ పరగడుపున తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కాకరకాయలో యాంటి ఆక్సిడెంట్లు, యాంటీ అలర్జీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి.

మునగాకు జ్యూస్: మునగాకులో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఆకుల్లో నారింజ కంటే 7 రెట్లు ఎక్కువ విటమిన్ సి, అరటిపండ్ల కంటే 15 రెట్లు ఎక్కువ పొటాషియం ఉంటుంది. ఇది కాల్షియం. ప్రొటీన్ ఐరన్, అమైనో యాసిడ్‌లను కూడా కలిగి ఉంది.

జ్యూస్ ధరలు ఇలా :

ఏ జ్యూస్ అయినా కాకినాడ నగరంలో రూ.30, విటమిన్ ఏ, బీ, సీ జ్యూస్ అయితే రూ.60, గోధుమగడ్డి జ్యూస్ రూ.40, మిక్స్ వెజిటేబుల్స్ జ్యూస్ రూ.40 విక్రయిస్తున్నారు.

- కాకినాడ కార్పొరేషన్/ఆంధ్రజ్యోతి

గోవిందా...హరి గోవిందా

- ఐదోరోజు బ్రహ్మోత్సవాల్లో మహాలక్ష్మి హోమం
- భక్తి శ్రద్ధలతో గోదావరి నదీజల సంగ్రహణం
- మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై శ్రీవారు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడ్ని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరి పూజలు అందుకున్నారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం.. ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, అభిషేకాలు, హోమాలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపారు. మంగళ వాయిద్యాలతో శోభాయాత్రగా వెళ్లి గోదావరి నదీజల సంగ్రహణ నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి మూలమంత్ర పూర్వక మహాలక్ష్మి హోమం వేదమంత్రాల సాక్షిగా జరిపారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కనక దుర్గాదేవి దంపతులు బ్రహ్మోత్సవ పూజలు చేశారు. వివిధ రాష్ట్రాల కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఊర్రుతలూగించాయి. విద్యుత్ దీపాలంకరణ, మంగళ వాయిద్యాలతోపాటు సుగంధ పరిమళాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య స్వామివారి క్షేత్రం పులకించింది. ఫొటోషూట్‌ల వద్ద భక్తులు సందడి చేశారు. రాత్రి మలయప్ప అలంకరణతో అలంకృతుడైన శ్రీవారు గరుడ వాహనంపై ఆశీలనులయ్యారు. వేదఘోష, మిరుగొట్టు గొలిపే బాణసంచా కాల్పుల మధ్య తిరువీధుల్లో స్వామివారు విహరించారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు కూటమి నాయకులు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు శనివారం మహాపుష్ప యాగము, శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారి సూర్యప్రభ వాహనసేవ, సహస్ర దీపాలంకరణ సేవ, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహనసేవ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు పాల్గొంటారు.

బ్రహ్మోత్సవాలకు ఊరూర ప్రచారం

వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29 వరకు జరగనున్నాయి. భక్తులు వీటిని తిలకించేలా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉచిత బస్సులు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు తిలకించే ఏర్పాట్లు చేశారు. ఆటోల్లో సిబ్బంది విస్తృత ప్రచారం చేస్తున్నారు.



శ్రీవారికి కురువేరు దండ

ఖరీదు కిలో రూ.10వేలు

శ్రీ వేంకటేశ్వరస్వామికి ఎంతో ప్రీతికరమైన కురువేరు దండ ప్రాముఖ్యత సంతరించుకుంది. తమిళనాడు, కేరళ సముద్రతీరం వెంబడి నేలలో పెరిగే కురువేరు దండ ఎంతో ఖరీదైనది. కిలో రూ.10వేల నుంచి రూ.12వేలు పలుకుతుంది. ప్రతిఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలకు దాన్ని ఉపయోగిస్తారు. గరుడ వాహనంపై విహరించే శ్రీవారికి ఈ దండను వేస్తారు.



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు



లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న దృశ్యం



మహిళా భక్తుల సాంస్కృతిక ప్రదర్శన


నేటి నుంచి ఆధ్యాత్మిక పర్యాటక యాత్ర

టూరిజం బస్సును ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వారాంతపు ఆధ్యాత్మిక యాత్రకు శనివారం శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖా మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్‌లో ఉన్న టూరిజం ఆర్డీ ఆఫీసు నుంచి ఉదయం 6 గంటలకు బస్సును ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేవారి కోసం ప్రత్యేక ప్యాకేజీ నిర్ణయించారు. తొలుత భక్తులకు ఆధ్మాత్మిక సాంత్వన కలిగించడానికి ఆరు పుణ్యక్షేత్రాలతో ఈ యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది. రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ టూరిజం శాఖ ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం(ఐఆర్‌వో) వద్ద ప్రతి శనివారం ఉదయం 6గంటలకు బస్సులు బయలుదేరతాయి. ఈ యాత్ర రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతుంది.

యాత్ర ఇలా:

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనంతో యాత్ర మొదలవుతుంది. అనంతరం అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోటలోని చాణుక్య కుమార రామ భీమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అక్కడ మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. చివరగా వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు.



టికెట్ ధరలు

పెద్దలకు టికెట్ ధర రూ.1000 నిర్ణయించారు. మూడు నుంచి పదేళ్లలోపు వయస్సు గల చిన్నారులకు రూ.800 నిర్ణయించారు. శుక్రవారం రాత్రి 10 మంది యాత్రికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ బస్సులో 18 మంది యాత్రికులు ప్రయాణించవచ్చు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి మంత్రి దుర్గేష్

రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా ఒకరోజు ఆధ్మాతిక యాత్రను ప్రారంభిస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల సూచన మేరకు ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. భక్తులను రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామని, ఆదివారం కూడా యాత్రను కొనసాగించే ఆలోచన చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పవిత్రోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబు

నేటి నుంచి ప్రారంభం

మామిడికుదరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి పవిత్రోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబైంది. శనివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం ఉదయం విశ్వక్సేనారాధనతో ప్రారంభమయ్యే పవిత్రోత్సవాల్లో భాగంగా పలు పూజలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని పలు పూజలు నిర్వహించి శ్రీవారి శాంతి కల్యాణాన్ని జరపనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ త్రిదండి చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు, గొడవర్తి శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతిష్ఠతో సమానమైన పవిత్రోత్సవాల ద్వారా శ్రీవారిలో విశేషమైన తేజస్సు కలుగుతుందని తెలిపారు. భక్తులకు సమర్పణ చేసే పూజా ద్రవ్యాల ద్వారా పుష్పాలు, వస్త్రాలు మనసా వాచా కర్మణా జరిగే దోషాలు పరిహారమవుతాయని వారంటున్నారు. భక్తులు పవిత్రోత్సవాల్లో పాల్గొనాలని సహాయ కమిషనర్ కోరారు.



పవిత్రోత్సవాలకు చలువ పందిళ్లు వేస్తున్న సిబ్బంది



పవిత్రోత్సవాలకు ముస్తాబైన బాలబాలాజీ ఆలయం

విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు
సైన్స్ ఫేయిర్ దోహదం

జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు

పిఠాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల ఫ్యూచర్-2024 సైన్స్ ఫెయిర్, ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన అంశాలు ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులు, ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి జి.వెంకటరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బీవీ వెంకట త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



మత్స్యకారుల వలలో 20 అడుగుల కొండచిలువ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సలాదివారిపాలెం వారధి వద్ద గోదావరి నదీ పాయలో మత్స్యకారుల వలలో 20 అడుగుల భారీ కొండచిలువ చిక్కింది. దానిని వారు నది ఒడ్డున వదిలేసి వెళ్లిపోయారు. చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురై హతమార్చారు. రెండేళ్ల క్రితం ఈ కొండచిలువ సలాదివారిపాలెం వారధి వద్ద పశువుల్లంక వైపు సంచరించడాన్ని గుర్తించామని... ఇవతల వైపునకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో మత్స్యకారుల వలలో చిక్కుకుని ఉండవచ్చని స్థానికులు చెప్పారు.

- ముమ్మిడివరం



తలుపులమ్మ అమ్మవారికి ఐజీ పూజలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీవీ అశోక్‌కుమార్ కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం మహా మండపంలో వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు మహాప్రసాదం అందజేసి ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించారు.

- తుని రూరల్

కార్తీక మాస ఏర్పాట్లపై
రేపు సమీక్ష

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న ప్రారంభం కానున్న కార్తీక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షణ ఏర్పాట్లపై ఆదివారం అన్నవరం దేవస్థానంలో సమీక్ష జరగనుంది. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, అగ్నిమాపక, విద్యుత్, ఆర్టీసీ శాఖల ఉన్నతాధికారులతో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. దేవస్థానం సుమారు రూ.80 లక్షలతో కొనుగోలు చేసిన బస్సులను ఉదయం 9 గంటలకు ఈవో ప్రారంభిస్తారు. మరోపక్క అదేరోజున భక్తులు సత్యదీక్ష స్వీకరించనున్నారు. ఇప్పటికే సుమారు 1,500 మందికి దీక్షా వస్త్రాలు, మాలలను దేవస్థానం తరపున ఉచితంగా అందజేశారు.



ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

సత్యదేవుని సన్నిధిలో విజయ రాజేశ్వరీ
శ్రీవిద్యా పీఠాధిపతి

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి విజయవాడ సమీపంలోని విజయ రాజేశ్వరీ శ్రీవిద్యా పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామీజీ శుక్రవారం విచ్చేశారు. ఆయనకు ఏపీ ఆర్జో ఎం.గణపతి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామీజీ వెంట శిష్యులు విజయ భూమానందగిరి, శివప్రియానందగిరి వున్నారు.

ఇద్దరు వ్రత పురోహితుల
సస్పెన్షన్

నలుగురు సూపర్‌వైజర్లకు చార్జి మెమో

అన్నవరం, అక్టోబరు 25: అన్నవరం దేవస్థానంలో సెకండ్‌గ్రేడ్ వ్రత పురోహితులుగా పని చేస్తున్న రాయప్రోలు ఎస్‌వీఎస్ శ్రీరామచంద్ర మూర్తి, పెండ్యాల వీఆర్‌టీకే శర్మ (రాము)లను సస్పెండ్ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్రత మాచరించే భక్తుల నుంచి దానాల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న వేర్వేరు ఫిర్యాదుల మేరకు వారిద్దరిపై ఈ చర్యలు తీసుకున్నారు. వారి డ్యూటీ సూపర్‌వైజర్లు చామర్తి కన్నబాబు, గుత్తిన శ్రీనివాస్, చామర్తి జగ్గారావు, పొన్నపల్లి శాస్త్రిలకు చార్జి మెమో ఇచ్చారు. ఈవో శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో వ్రత పురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. భక్తులు ఇచ్చింది సంతృప్తిగా తీసుకోవాలని... వ్రతం పూర్తయిన అనంతరం వస్త్రదానం, అన్నదానం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్తీక మాసంలో వ్రత మాచరించే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఉత్తర్వులకు అనుగుణంగా వ్రతాలు ప్రారంభించాలని కోరారు.

అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

పి.గన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో ఈ నెల 23న అరవై ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన లంకె సత్యనారాయణపై బాధితురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా అందిన సమాచారంతో సత్యనారాయణను ఆయన నివాసంలో సీఐ ఆర్.భీమరాజు అరెస్టు చేశారని ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. నిందితుడిని కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.



నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులతో రిజిస్ట్రార్ సుధాకర్

నన్నయ వర్సిటీకి మరింత గుర్తింపు తేవాలి

రిజిస్ట్రార్, క్రీడా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు తమ ప్రతిభతో నన్నయ విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, క్రీడా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులు జరిగిన అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ కం జట్టు ఎంపిక శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ టోర్నమెంట్‌కు హాజరైన వారిలో ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులతో పాటు మరో నలుగురిని నన్నయ విశ్వవిద్యాలయం జట్టు సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. వీరు నవంబరు ఒకటో తేదీ నుంచి బెంగళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో రామచంద్రపురం ప్రభుత్వ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడ డీఆర్కే రెడ్డి కళాశాల, మూడవ స్థానంలో పెనుగొండ ఎస్‌కేవీపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల నిలిచాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులైన రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు రమణ, కోర్సు కో-ఆర్డినేటర్ కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, బి.రామ్‌గోపాల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న రామచంద్రపురం ప్రభుత్వ కళాశాల క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ నన్నయ విశ్వవిద్యాలయ పురుషుల జట్టు

వై.పవన్‌కుమార్, వి.అఖిల్‌కుమార్, ఎస్.వంశీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం), టి.రాజేష్‌కుమార్, కె.సత్యనారాయణ, ఎస్‌కే అహ్మద్ అలీషా (డీఆర్‌కే రెడ్డి కళాశాల, జి.మామిడాడ), వి.సాయికిరణ్, ఎన్.ప్రవీణ్‌కుమార్, కేవీఎస్ కృష్ణారెడ్డి (ఎస్‌వీకేపీ కళాశాల, పెనుగొండ), బి.నీరజ్‌కుమార్ (సీఆర్ఆర్ కళాశాల, ఏలూరు), ఒ.రాజేష్ (పీఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), సీహెచ్ అవినాష్ (సూర్యరాయ కళాశాల, పిఠాపురం), పి.అనిల్‌కుమార్ (ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.జానకిరామ్ (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), కె.షాహిల్ (వీఎస్ఎం కళాశాల, రామచంద్రపురం).

పూడ్చిపెట్టిన మృతదేహానికి పంచనామా

అక్రమ సంబంధం నేపథ్యంలో మధుని హతమార్చారని బంధువుల ఆరోపణ
పోలీసుల అదుపులో శిరీష, ప్రశాంత్

తొండంగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో వారం క్రితం మృతి చెందిన బత్తిన మధుబాబు (38) మృతదేహానికి అధికారులు శుక్రవారం శవ పంచనామా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి మధుబాబు భార్య శిరీష, రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌కుమార్.. మధుబాబు ఇంట్లో కలిసి ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు, బంధువులు పట్టుకున్నారు. వారిద్దరి మధ్య ఉన్న అక్రమ సంబంధం కారణంగానే మధుబాబును హత్యచేసి ఉంటారని, సహజ మరణం కాదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీతంపేట సమీపంలోని ఒక ఆసుపత్రిలో పనిచేస్తున్నపుడు శిరీష, ప్రశాంత్‌కుమార్ మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధంగా మారిందని, మానుకోవాలని మధుబాబు పలుమార్లు హెచ్చరించాడని బంధువులు పోలీసులకు తెలిపారు. తాజాగా భర్త మృతి చెందిన వారం గడవక ముందే శిరీష, ప్రశాంత్‌కుమార్ కలిసి ఉండడంతో వారే మధుబాబును అడ్డుతొలగించుకునే లక్ష్యంతో హత్య చేసి ఉంటారని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు శ్మశానంలో పూడ్చిపెట్టిన మధుబాబు మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. తొండంగి తహసీల్దారు మురార్జీ సమక్షంలో తుని ఏరియా ఆసుపత్రి వైద్యులు జగన్మోహన్, సాయి కిరణ్ శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. శిరీష, ప్రశాంత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.



మధుబాబు (పాత చిత్రం)

లారీ ఢీకొని వార్డు సభ్యుడి మృతి

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రంగంపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోడెం నాగేశ్వరరావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు వివరాల ప్రకారం... నాగేశ్వరరావు బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో దివాన్‌చెరువులోని పాతూరి రామాలయం వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. నాగేశ్వరరావు తలపై నుంచి వాహనం వెళ్లిపోవడంతో మెదడు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు సంఘటనాస్థలానికి చేరుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నాగేశ్వరరావు వెంకటాపురం పంచాయతీ 4వ వార్డు సభ్యుడని, గ్రామంలో అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తాడని సర్పంచ్ గంగరావు తెలిపారు. దసరాకు గ్రామంలో కిరాణా వ్యాపారం ప్రారంభించాడని... రాజమహేంద్రవరం వెళ్లి కిరాణా సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసుకుని వస్తూ ప్రమాదానికి గురి కావడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొమ్మూరు ఎస్ఐ ఎస్‌పీ కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాగేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పిఠాపురంలో కల్తీ నెయ్యి తయారీ

మునిసిపల్, పోలీసు అధికారుల దాడులు
265 కిలోల పదార్థాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జంతువుల కొవ్వు, డాల్డా, ఇతర సామాగ్రి

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో కల్తీ నెయ్యిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో ఓ ఇంట్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారన్న సమాచారంతో కమిషనరు కనకారావు ఆధ్వర్యంలో మునిసిపల్, పోలీసు సిబ్బంది శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తయారు చేసిన, తయారీకి సిద్ధంగా 12 టిన్నుల్లో, పలావు డేగిసాల్లో ఉన్న 265 కిలోల జంతువుల కొవ్వు, డాల్డా కల్తీ నెయ్యి, ఇతర పదార్థాలు, నెయ్యి తయారీకి వినియోగించే సామగ్రిని సీజ్ చేశారు. వీటితో కల్తీ నెయ్యి తయారు చేసి దీపాలు వెలిగించే నెయ్యిగా విక్రయిస్తున్నట్టు ఇంట్లో ఉన్న మహిళలు తెలిపారని కమిషనరు చెప్పారు. చట్టవిరుద్ధంగా తయారు చేస్తున్న నిర్వాహకుడు బండారు ఫణి కుమార్‌పై కేసు నమోదు చేశారు.

తండ్రికి అన్నీ తానై...

పాణింగపల్లిలో అంతిమ సంస్కారాలు నిర్వహించిన కుమార్తె

కె.గంగవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రికి అంతిమ సంస్కారాలు చేసి రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పాణింగపల్లికి చెందిన చేత్రాది సత్యనారాయణకు ఒక్కగానొక్క కుమార్తె వీరవేణి. ఆమెను కె.గంగవరం గ్రామానికి చెందిన నేమాని శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేయగా ఇద్దరు కుమార్తెలు జన్మించారు. విధి వక్రీకరించి పిల్లల చిన్న తనంలోనే శ్రీనివాస్ మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెలతో వేణు తండ్రి చెంతకు చేరుకుంది. ఇద్దరు పిల్లలను పెద్దచేసి వివాహాలు చేశారు. సత్యనారాయణ శుక్రవారం వయోభారంతో కన్నుమూశాడు. చిన్నతనం నుంచే తనను అల్లారు ముద్దుగా పెంచడమే కాకుండా తనకు వైధవ్యం కలిగిన తర్వాత పిల్లలను పెంచి పోషించి వారికీ పెళ్లిళ్లు చేసిన తండ్రి లోకం విడిచిపోవడంతో వీరవేణి కన్నీరుమున్నీరుగా విలపించింది. కొడుకులు లేని లోటు లేకుండా తానే కొడుకుగా మారి అంతిమ సంస్కారాలు నిర్వహించింది.



తండ్రి అంతిమ యాత్రలో పాల్గొన్న వీరవేణి

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

పిఠాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ బాలాజీ రైసుమిల్లులో జరుగుతున్న షెడ్డు నిర్మాణ పనుల్లోకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడికి చెందిన పుట్టి వెంకటరమణ వచ్చాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు రేకు తగిలి తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ గుణశేఖర్ పరిశీలించారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కిడ్నాప్ యత్నానికి పాల్పడిన
తొమ్మిది మందిపై కేసు నమోదు

కొత్తపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో తన కూతురిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారంటూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన దంగేటి వెంకటరత్నం చేసిన ఫిర్యాదుతో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కోరుమిల్లికి చెందిన వెంకటరత్నం తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 20న ద్విచక్ర వాహనంపై తన పుట్టినిల్లు అయిన అంబాజీపేట మండలం ముక్కామల వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం కోరుమిల్లి బయల్దేరారు. కొత్తపేట సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి కోరుమిల్లికి చెందిన పోలిశెట్టి కృష్ణ అనే యువకుడు మరో ఎనిమిది మందితో కలిసి వారిని అడ్డగించి కుమార్తెను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. వారు కిడ్నాపర్ల నుంచి విదిలించుకుని కోరుమిల్లి వెళ్లి గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచన మేరకు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర చెప్పారు.



రామాలయం ఆవరణలో దీక్ష కొనసాగిస్తున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి

పవన్ కల్యాణ్ నుంచి హామీ లభిస్తేనే
దీక్ష విరమిస్తాం

- గుమ్మళ్లదొడ్డిలో నాలుగో రోజుకు నిరవధిక దీక్ష
- భగ్నం చేసేందుకు పోలీసుల యత్నం
- అడిషనల్ ఎస్పీతో చర్చలు విఫలం

గోకవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ నుంచి తమకు హామీ లభిస్తేనే దీక్ష విరమిస్తామని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాలని డిమాండ్ చేస్తూ బాధితులతో కలిసి వారు చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. గుమ్మళ్లదొడ్డి, అచ్చుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పిస్తాం గాని ఇథనాల్ పరిశ్రమ నిర్వహణను గుమ్మళ్లదొడ్డిలో కొనసాగనివ్వబోమన్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ద్వారా ఈ విషయం పవన్‌కల్యాణ్‌కు చేరేలా యంత్రాంగం కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ పరిశ్రమ వల్ల ఇప్పటికే చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు అనేక రకాల శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రులపాలవుతున్నారని ఆవేదన చెందారు.

దీక్షా శిబిరాన్ని రాజమహేంద్రవరం అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, సీఐ రాంబాబు సందర్శించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి తమ ఇబ్బందులను స్వయంగా పరిశీలించి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా సరైన హామీ ఇప్పిస్తేనే దీక్ష విరమిస్తామని బాధితులు వారికి చెప్పారు.

కాగా నిరవధిక దీక్షను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో బాధితులు, ప్రజలు వారితో వాగ్వాదానికి దిగారు. ప్రాణాలకు తెగించి దీక్ష చేస్తుంటే దౌర్జన్యానికి దిగుతారా అంటూ ఆందోళనకారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో పోలీసులు మిన్నకుండిపోయారు. రామాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకుని దీక్షను కొనసాగిస్తున్నారు.

ఇథనాల్ పరిశ్రమ నుంచి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, తక్షణం ఇక్కడి నుంచి తొలగించాలని గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పాలకవర్గం తరపున తీర్మానం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని సర్పంచ్ శరకణం రామలక్ష్మి తెలిపారు.



దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సుబ్బరాజు

విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విభాగ్ కన్వీనర్ సత్యసాయి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతారని, పలు అంశాలపై చర్చిస్తామని సత్యసాయి చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి అభిషేక్, మహిళా కన్వీనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మకు స్వర్ణపుష్పార్చన

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానం లో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఈ అర్చన కార్యక్రమం వేదపండితులు చేపట్టారు. అనంతరం ప్రసాదాలను వితరణ చేశారు. దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లో?


కాకినాడ నగరంలోని కొండయ్యపాలెంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి

» కొండయ్యపాలెంలో ఆర్‌వోబీ నిర్మాణం
» సర్వీస్ రోడ్లు వదిలేసిన వైనం

కాకినాడసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఎన్నో అడ్డంకులు.. అవరోధాలు. ఎట్టకేలకు వాటిని అధిగమించి కాకినాడ నగరంలోని కొండయ్యపాలెం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశారు. కానీ ఈ బ్రిడ్జి దిగువ ఇరువైపులా సర్వీస్ రోడ్లను నిర్మించకపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. 2008లో శంకుస్థాపన చేసిన కొండయ్యపాలెం ఆర్వోబీ 2024లో పూర్తయి వాడుకలోకి వచ్చింది. కొండయ్యపాలెం ఆర్వోబీ మినీ బైపాస్ రోడ్డుగా కూడా వాడుకలోకి వచ్చింది. ఈలోగా ముగ్గురు ఎమ్మెల్యేలు మారారు. ఇటు రామారావుపేట వైపు సర్వీస్ రోడ్డు, అటు కొండయ్యపాలెం వైపు సర్వీస్ రోడ్లను గ్రావెల్ రోడ్లుగా వదిలేశారు. దీంతో ఈ సర్వీస్ రోడ్ల వెంబడిగల ఇళ్ల యజమానులు రాకపోకలకు నానాయాతన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మట్టి రోడ్లపై పెద్ద పెద్దగోతులు ఏర్పడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రబ్బిస్‌తో గోతులు పూడ్చి రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్అండ్‌బీ ద్వారా ఈ చేపట్టిన ఈ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ పరిహారంపై సమస్య తలెత్తింది. దీన్ని అధిగమించేసరికి నిధుల సమస్య ఎదురైంది. దీంతో కార్పొరేషన్ నిధులు వెచ్చించి నిర్మాణ పనులు పూర్తి చేయించారు. నిధుల లేమితో కొండయ్యపాలెం వైపు రెండు సర్వీస్ రోడ్లను నిర్మించలేదు. రామారావుపేట వైపు సర్వీస్ రోడ్లలో తూర్పు వైపు భూసేకరణ పరిహారం కొలిక్కి రాక న్యాయస్థానంలో ఉంది. దీనిపై కూటమి ప్రజాప్రతినిధులు దృష్టిసారించి సర్వీసు రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


కొండయ్యపాలెం రైల్వేఓవర్‌బ్రిడ్జి ఇరువైపులా భూసేకరణ పరిహారం సమస్యతో పూర్తికాని సర్వీస్ రోడ్లు

గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాళ్లరేవు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటరులో గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. కోరింగ నుంచి ఆర్టీసీ బస్సు ఎక్కి యానాం వరకు టికెట్టు తీసుకున్న అత డు నీలపల్లి వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యా డు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా తాళ్లరేవు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోలీసులు భద్రపరిచారు. ఆచూకీ తెలిసినవారు కోరింగ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

మధ్యాహ్న భోజనం ఉపాధ్యాయులు రుచి చూసేలా చర్యలు : ఎంఈవో

కొత్తపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలకు సరఫరా అయ్యే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాలు ఉపాధ్యాయులు రుచిచూసే విధంగా చర్యలు చేపడుతున్నట్టు కొత్తపల్లి ఎంఈవో బుర్రా వేణుగోపాల్ తెలిపారు. మధ్యాహ్న భోజనంలో ముద్దలుగా అన్నం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిన వెలువడిన కథనంపై ఆయన స్పందించారు. గురువారం కుతుకుడుమిల్లి ప్రాథమిక పాఠశాల తప్ప అన్ని పాఠశాలల్లో తాను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించానన్నా రు. కుతుకుడుమిల్లిలో రంగుసాంబారు, ము ద్దల అన్నం విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకమీదట మధ్యాహ్న భోజనం ఉపాధ్యాయులు రుచి చూసిన అనంతరం పిల్లలకు పెట్టేవిధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

'నామినేటెడ్ పదవుల్లో చేనేతలకు ప్రాధాన్యమివ్వాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంట్ పరిధిలో కూటమి విజయంలో ప్రధాన పాత్ర పోషించిన చేనేతలకు స్థానిక సంస్థలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నామినేటెడ్ పదవుల్లో జనాభా దామాషా ప్రకారం తగిన ప్రాధాన్యం కల్పించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గా రమేష్ కోరారు. కాకినాడలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలోని చేనేత సంఘాలు, చేనేత కుల సంఘాల నాయకులతో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో చేనేతలకు జరుగుతున్న అన్యాయంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేపట్టాలన్నారు. బీహార్ మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణన నిర్వహించి రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలన్నారు. రాబోయే ఎమ్మెల్సీ స్థానాల్లో చేనేతలకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేనేత నేతలు జగ్గారపు మల్లికార్జున్, కొల్లు వెంకటేశ్వ రరావు, చిల్లపల్లి గణపతి, పొన్నగంటి సత్యనారాయణ, పసగడుగుల శేషగిరిరావు, ఇమ్మంది చంద్ర రావు, పలివెల లక్ష్మిరాజ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాడి పశువుల సంక్షేమానికి 'పశుగణన'


పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి పశువుల సంక్షేమంతో పాటూ పాడిరైతుల అభ్యున్నతికి పశుగణన ఎంతగానో దోహదం చేస్తుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. 21వ అఖిల భారత పశుగణన ఏపీ కార్యక్రమం శుక్రవారం గొడారిగుంటలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుగణన కార్యక్రమం మంచి కార్యక్రమని, ఇది అక్టోబరు 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. ఈ గణనలో భాగంగా పశువుల సమగ్ర సమాచారంతో పాటూ రైతులకు చెందిన వ్యవసాయ పరికరాల వివరాలను సేకరించడం మంచి పరిణామమన్నారు. ఈ సర్వేతో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే వారి సంక్షేమం, అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు వీలుంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుగణనలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, పందులు తదితర 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరించడం జరుగుతుందని డిప్యూటీ డైరెక్టర్ సూర్యకుమారి తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ టీవీ సురేష్, ఎంవీ రవికిరణ్, నాయకులు శిరంగు శ్రీనివాసరావు,పాండ్రంకి రాజు ఉన్నారు.

కేంద్రం నిర్ణయంపై హర్షం

ఏపీ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసేలా రూ. 2,245 కోట్లతో కొత్త రైలు మార్గం ఏర్పాటుకు కేంద్ర మంత్రి మండలి నిర్ణయించడం పట్ల కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హర్షం వ్యక్తం చేశారు. గొడారిగుంటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు కొత్త రైలు మార్గం కనెక్టివిటీకి అనుసంధానం చేసేలా కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంతో రానున్న రోజుల్లో కాకినాడ పోర్టుకు మహర్దశ పట్టనుందన్నారు. దీంతో కాకినాడ జిల్లా వాణిజ్య, వ్యాపార పరంగా జిల్లా క్రియాశీలంగా మారనుందన్నారు. అమరావతి రైల్వేలైన్ కచ్చితంగా మోడల్ రైలు మార్గంగా నిలవనుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. పవన్ కృషికి చంద్రబాబు అనుభవం తోడవ్వడంతో ప్రధాని మోదీ కొత్త రైలు మార్గానికి నిధులు మంజూరు చేశారన్నారు.

'బాణసంచా విక్రయాల్లో భద్రతా చర్యలు పాటించాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో బాణసంచా విక్రయాల్లో భద్రతా చర్యలు పాటించాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. దీపావళి పండుగ సందర్భంగా కాకినాడలో ఏర్పాటు చేసే తాత్కాలిక బాణసంచా దుకాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు నిర్దేశించిన పరిమాణం ప్రకారమే నిల్వలు ఉంచాలని, అంతకంటే ఎక్కువ నిల్వ ఉంచితే శిక్షార్హులవుతారన్నారు. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, రూరల్ తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, డివిజనల్ ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు, హెల్త్‌ఆఫీసర్ పృథ్వీచరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆర్డీవో మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్, బోట్‌క్లబ్ ప్రదేశాల్లో విక్రయ దుకాణాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాణసంచా సీజ్

కాకినాడ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూరంగిలో అనుమతి లేకుండా నిల్వ చేసి ఉన్న రూ.1,10,000 విలువ చేసే బాణసంచాను ఇంద్రపాలెం పోలీసులు శుక్రవారం సాయంత్రం సీజ్ చేశారు. గ్రామంలోని మద్దాల వెంకటేశ్వరరావు తన ఇంట్లో బాణసంచాను నిల్వచేశాడని అతడిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.


బోనస్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఎమ్మెల్యే స్వగృహం వద్ద శ్రీ వినాయక డీప్ వాటర్ పోర్టు యూనియన్ సభ్యులైన కార్మికులకు డ్యూటీ, బోనస్ సొమ్ము శుక్రవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓలేటి పాండురంగడు, బలసాడి శ్రీను, సభ్యులు పాలెపు ధర్మారావు, చిన్నబ్బాయి, ఈశ్వరరావు,తాతీలు పాల్గొన్నారు.

భారీ కొండ చిలువ హతం

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి గ్రామ శివారున వరి పొలంలో శుక్రవారం వరి కోత కోస్తుండగా భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. భయాందోళనకు గురైన స్థానికులు దాన్ని మట్టుపెట్టారు. దాని పొడవు 12 నుంచి 15 అడుగుల ఉంటుందని తెలిపారు.



రీసర్వే గ్రామసభలతో పక్కాగా రెవెన్యూ రికార్డులు : తుమ్మల


కార్యక్రమంలో మాట్లాడుతున్న తుమ్మల

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామసభలతో పక్కాగా రెవెన్యూ రికార్డుల నిర్వహణ జరుగుతుందని జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూసమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సభలను తప్పక సద్వినియోగం చేసుకోవాల న్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ రికార్డుల్లో కచ్చితత్వం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఆర్ఐ వెంకటేష్, టీడీపీ నాయకుడు తుమ్మల నాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: మండలంలో మామిళ్ళదొడ్డి గ్రామంలో రీసర్వే గ్రామసభ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరెడ్డి రైతుల నుంచి 26అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ వై. శ్రీనివాస్, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు తదితరులున్నారు.

తాళ్లరేవు: ఉప్పంగలో గ్రామసభలో రైతుల వినతులను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. సర్పంచ్ శాఖ శంఖరుడు అధ్యక్షతన జరిగిన సభలో తహశీల్దార్ పి.త్రినాధరావు, డీటీ సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

పంటకాలువ కబ్జాపై పవన్ ఆగ్రహం

తక్షణం పునరుద్ధరించాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు - ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పంటకాలువను తిరిగి తవ్వుతున్న దృశ్యం

పిఠాపురం రూరల్, అక్టోబరు 25: పంటకాలువను కబ్జా చేసిన విషయంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం పునరుద్ధరించాలని ఆదేశించగా అధికారులు కదిలారు. ఆక్రమణలు తొలగించే పనులు చేపట్టారు. పిఠాపురం మండలం కోలంక గ్రామంలోని పంటకాలువను కబ్జా చేసి లేఅవుట్ నిర్వాహకులు రహదారి నిర్మించే ప్రయత్నం చేస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. ఆంధ్రజ్యోతి వార్త డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి వచ్చింది. దీనిపై జిల్లా కలెక్టరు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. 60 ఎకరాలకు సాగునీరు అందించే పంటకాలువను కబ్జా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి పరిస్థితుల్లో ఇటువంటి వాటిని ఉపేక్షించవద్దని, తక్షణం పంటకాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో సర్వే చేసినా ఆక్రమణలు తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిడులకు తలొగ్గవద్దని దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎవరు తప్పు చేసినా నాతో సహా ఉపేక్షించవద్దు, చట్టం, నిబంధనల ప్రకారం వెళ్లాలని తాను చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో అధికారులు కదిలారు. కోలంక చేరుకుని పంటకాలువను పునరుద్ధరించే పనులు చేపట్టారు. కబ్జా చేసిన కాలువను తవ్వడం ప్రారంభించారు. త్వరలోనే కాలువ పూర్వ స్థితికి వస్తుందని తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి : కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రజా వినతుల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. శారదమ్మ గుడి వద్ద గల నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంపై శుక్రవారం కమిషనర్ నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించి ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి అధికారులు తీసుకున్న చర్యలను కమిషనర్ తెలుసుకున్నారు.


మరుగుదొడ్లు ప్రారంభిస్తున్న దృశ్యం

తాటిపర్తిలో గ్రీన్ టాయిలెట్లు నిర్మించిన నెస్లే

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 25: గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సరైన టాయిలెట్లు అందుబాటులో లేక ఇక్కట్లు పడేవారు. నెస్లే కంపెనీ తన సీఎస్ఆర్ నిధుల ద్వారా బాలికల కోసం ప్రత్యేకంగా టాయిలెట్లు నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగా హైస్కూలులో రూ.5లక్షలతో గ్రీన్ టాయిలెట్లు నిర్మించారు. వాటిని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నెస్లే కంపెనీ కార్పొరేట్ ఎఫైయిర్స్ మేనేజరు వాసిమ్ అహ్మద్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ దాసం వెంకటరమణ, హెచ్‌ఎం నాగమణి తదితరులు ఉన్నారు.

పగలు వెలిగి...రాత్రి వెలగక!


దుర్గాడలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు, రాత్రిపూట వెలగని దృశ్యం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పగటి పూట వెలిగే వీధిలైట్లు రాత్రయ్యేసరికి ఆగిపోతున్నాయి. అంధకారంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో వీధిలైట్ల పరిస్థితికి ఇదొక తార్కాణం. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న వీధిలైట్లు పగటిపూటే వెలుగుతూ ఉంటాయి. రాత్రి వెలగవు. దీంతో అక్కడ వీధులు అంధకారంలో ఉండి ప్రజలు బయటతిరిగేందుకు ఇబ్బందులుపడుతున్నారు.

భారీ అన్నసమారాధన

కొత్తపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జైభేరిళాళస్వామి నవరాత్రుల ఉత్సవాలను ముగింపు పురస్కరించుకుని కుతుకుడుమిల్లి బజారు వీధిలో శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. కొత్తపల్లి, రవీంద్రపురం, నిదానదొడ్డి, కలవలదొడ్డి, వాకతిప్ప తదితర గ్రామాల ప్రజలు సమారాధనలో పాల్గొన్నారు.

బైక్ దొంగలకు ఏడాది జైలు

కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై బైక్‌లు దొంగతనం చేసిన కేసులో ముగ్గురు యువకులపై నేరారోపణ రుజువు కావడంతో కాకినాడ ఒకటవ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి. సాహితి ఒక్కోక్కరికిఏడాది చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడ అర్బన్ ఏరియాకు చెందిన దమ్ము శివప్రసాద్, ములపర్తి కిషోర్, గుండారపు శివరామసాయి ముగ్గురు కలిసి కాకినాడ చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న బైక్‌లను అపహరించి వాటిని మధ్యవర్తుల ద్వారా విక్రయించి ఆ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో గతేడాది ఫిబ్రవరి 25న కాకినాడకు చెందిన గున్నాబత్తుల భవాని శంకర్‌కు చెందిన బుల్లెట్ బైక్‌ను ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అపహరణకు గురైంది. గతేడాది మే 9న కాకినాడ టూటౌన్ సీసీఎస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీసీఎస్ ఎస్ఐ, ప్రస్తుత పెద్దాపురం సీఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం వాదోపవాదనల్లో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ రఘువీర్ వాదించారు.

మందుబాబులకు జైలు, జరిమానా

మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 28మంది వాహనదారులకు కాకినాడ మూడో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కాకినాడలోని పలు ముఖ్యకూడళ్లలో గురువారం రాత్రి ట్రాఫిక్ సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి 28మంది పట్టుబడగా వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. వారిలో 10మందికి ఒక్కొక్కరికీ 2రోజుల చొప్పున జైలు శిక్ష, మరో18మందికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు తెలిపారు.

వలంటీర్ల ఆందోళన

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని, రాజీనామా చేసిన వారిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ చేబ్రోలులోని గుడి సెంటర్‌లో సీఐటీయూ అనుబంధ ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్షుడు నందేశ్వరరావు, వలంటీర్ల అసోసియేషన్ జిల్లా కోకన్వీనర్ ఏ.ప్రకాష్, సీహెచ్.అప్పారావు, కుమార్, కె.ఉమాదేవి, డి.నాగమణి ఉన్నారు.

పిఠాపురంలో జాబ్‌మేళా

పిఠాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. విజయవర్మ అండ్ కో, డైకిన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఎంపికలు జరిపారు. 93మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరు కాగా 28మందికి ఉద్యోగాలు లభించాయి. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవరావు, ఎంప్లాయిమెంట్ ఆఫీసరు ప్రేమ్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్, కోఆర్డినేటర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

28న కాకినాడలో...

కాకినాడ సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న కాకినాడ వికాసలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో వివిధ కంపెనీల్లో సేల్స్ వీడియో మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 7799376111లో సంప్రదించాలన్నారు.

30న సంగీత స్రవంతి నెలవారీ గానసభ

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న సంగీత స్రవంతి ఆధ్వర్యంలో నెలవారీ గానసభ నిర్వహిస్తున్నామని సంస్థ సంయుక్త కార్యదర్శి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. కాకినాడ సూర్యకళామందిరంలో ఆ రోజు సాయంత్రం 5గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నాదజ్యోతి ముత్తుస్వామి దీక్షితార్ కృతుల గానం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా సంగీత విద్వాంసులు వారి శిష్యబృందం గాత్ర, నాదస్వరం కచేరీ జరుగుతుందని సంగీత స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.జగదీశ్వరి తెలిపారు.

'రాజశేఖర్‌ని గెలిపించాలి'

తాళ్లరేవు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించాలని టీడీపీ సీనియర్ నేత టేకుమూడి లక్ష్మణరావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్సీ ఓటర్లను అభ్యర్థించి రాజశేఖర్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు ఉన్నారు.

ఫర్నీచర్ బహూకరణ

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో ఉన్న 3 ప్రభుత్వ పాఠశాలలకు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మన్యం ప్రసన్నకుమార్, కల్తూరి శ్రీనివాస్, పెనుమర్తి దొరబాబు, సానిపిన సురేష్ రూ.20 వేల విలువ చేసే ఫర్నీచర్ బహూకరించారు. వాటిని పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరరావుకు అందచేశారు. పాఠశాల ఆవరణలో 100 కొబ్బరి మొక్కలు నాటారు. ఎస్‌ఎంసీ చైర్మన్ మన్యం చిన్న, పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్, నల్లల శ్రీను ఉన్నారు.

కాకినాడలో మెప్మా మార్కెట్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను నగరంలో ప్రారంభించారు. రిజర్వు పోలీస్ లైన్ సమీపంలోని ఉన్న ఓల్డ్ మీ సేవా కేంద్రంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ఉంచారు. మెప్మా పీడీ ప్రియంవద ప్రారంభించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు, మెప్మా సీఓలు, ఆర్పీలున్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పురపాలకసంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మెప్మా అర్బన్ మార్కెట్(మెప్మా బజారు) నిర్వహించారు. మెప్మా కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ బజారు మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, సబ్బులు, ఫినాయులు, సెంట్లు, బ్లౌజులు, కాటన్ చీరలు, నైటీలు, లంగాలు, గాజులు, వన్ గ్రామ్ గోల్డు, మసాలా పొడి ప్యాకెట్లు, డెకరేటివ్ ఐటెమ్స్ తదితర ఉత్పత్తులను విక్రయానికి ఉంచి ప్రదర్శించారు. మెప్మా సీఎంఎం కె.వెంకటలక్ష్మి, సీవోలు ఎండీ ఉమ్మా సల్మా, ఏడీ శైలజ, సీహెచ్. శ్రీవల్లీ తదితరులున్నారు.

భవ్యశ్రీకి ప్రశంసాపత్రం

సామర్లకోట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. భవ్యశ్రీని ప్రథమ బహుమతి సాధించింది. శుక్రవారం కాకినాడలో కలెక్టర్ షాన్‌మోహన్ భవ్యశ్రీకి రూ.5వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. డీవైఈవో కె.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ, ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పులయ్య అధ్యాపకులు భవ్యశ్రీని అభినందించారు.


కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న భవ్యశ్రీ

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

డిసెంబరు 4న ప్రజా హక్కుల ర్యాలీ

జగ్గంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న మత రాజకీయాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 4న విజయవాడలో ప్రజా హక్కుల ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని గోవిందపురంలో ర్యాలీ నిర్వహించారు. జక్కంపూడి రాజు, అచ్చారావు తదితరులున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


గోదావరిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న రాష్ట్ర విపత్తుల దళం సభ్యులు

పాపికొండలు విహార యాత్రకు గ్రీన్‌సిగ్నల్

దేవీపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద బోట్ పాయింట్‌ను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం పరిశీలించారు. పాపికొండలు విహార యాత్రకు సంబంధించి బోట్లు ప్రయాణించే మార్గాల్లో ఇబ్బందులు, నీటిమట్టంపై ఆరా తీశారు. దేవీపట్నం దాటిన తర్వాత గోదావరి మధ్యలో రాష్ట్ర విపత్తుల దళం సభ్యులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పుడు కంగారు పడకుండా ఏ విధమైన రక్షణచర్యలు తీసుకోవాలో వివరించారు. రంపచోడవరం సీఐ రవికుమార్, తహసీల్దారు సత్యనారాయణ, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు

శనివారం నుంచి పాపికొండలు విహార యాత్రకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో మూడు నెలల విరామం తర్వాత గోదావరిలో పర్యాటక బోట్లు తిరగనున్నాయి. బోట్లకు అన్ని అనుమతులూ పక్కాగా ఉండాలని సూచించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ లైఫ్ జాకెట్ ఉండాలని, పర్యాటకుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 9 గంటలకు బయల్దేరి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

ఏజెన్సీలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

రంపచోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో సెక్టారు అధికారులతో సమీక్షించారు. పీవో మాట్లాడుతూ శాఖల ద్వారా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ, నాబార్డు ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. ఏజెన్సీలో ఇంకా అటవీ శాఖ ద్వారా అనుమతులు పొందాల్సిన రోడ్లు, ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు మొక్కల పంపిణీ, వైద్య శాఖలో హెల్త్ కార్డుల పంపిణీ, అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం తదితర అంశాలపై ఆరా తీశారు. ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఎస్‌వో మార్తమ్మ, సీడీపీవో సంధ్యారాణి, పీహెచ్‌వో చిట్టిబాబు, పీఏవో రాంబాబు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలను 150 రోజులకు పెంచాలి

కాంటూరుతో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి స్వర్ణ



ఎటపాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'ఎటపాక ఏజెన్సీలో ఈ ఏడాది పంటల సాగు అంతంతమాత్రమే కావడంతో పనులు లేక కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు... వారికి ఉపాధి హామీ పథకంలో పని దినాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 150 రోజులకు పెంచాలి' అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం గన్నవరంలో ఆ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ పోడు పట్టాలున్న వారికే 150 రోజుల పనిదినాలు కల్పిస్తున్నారని, మిగతా వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు పక్క మండలాల్లో ఇచ్చిన విధంగా జీవన భృతి రూ.4,800 ఎటపాక మండల ప్రజలకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంటూరుతో సంబంధం లేకుండా ఎటపాక మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పోలవరం పరిహారం ఇవ్వాలన్నారు. పంట భూములు కలిగిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని, ఇటీవల మరణించిన వారికి చంద్రన్న భీమా పథకం వర్తింపచేయాలన్నారు. ఎంపీటీసీల పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు అనుమతి ఇవ్వడంలో సంబంధిత అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులకు వెంటనే అనుమతి మంజూరు చేయాలన్నారు. సర్పంచ్ గడ్డం భద్రమ్మ, సీపీఐ సీనియర్ నాయకుడు వల్లభనేని సత్యనారాయణ, ఎంపీటీసీ కంటే రాజు, సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు తొలగించాలని రాస్తారోకో



చింతూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతూరులో మూడు మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అవి ప్రధాన రహదారిని ఆనుకుని లక్ష్మీగణపతి ఆలయానికి అతి సమీపంలో ఉన్నాయని ప్రజలు నిరసన తెలిపారు. అయ్యప్ప మాలధారులు, ప్రజలు శుక్రవారం రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ అక్కడకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడి వారి సమస్యను తెలుసుకున్నారు. ఆ మూడు షాపులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. సోమవారంలోపు తొలగించాలని షాపుల నిర్వాహకులను సీఐ ఆదేశించారు.

గ్రామాల్లో స్వచ్ఛ భారత్

ఎటపాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్‌తోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడు తుందని ఏఎన్ఎం ఆదిలక్ష్మి పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా గన్నవరం, కృష్ణవరం గ్రామాల్లోని ప్రధాన వీధులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చెత్తాచెదారాలను తొలగించారు. మురుగుకాల్వలు, నీటి గుంతల్లో దోమల యాంటీ లార్వా మందు పిచికారీ చేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జయ, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం: కూనవరం మేజర్ పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది చెట్లు నరికి రోడ్లను శుభ్రం చేశారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్ గాంధీ, ఈవో సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని శరభవరంతో పాటు పలు తదితర గ్రామాల్లో ఎంపీడీవో రత్నకుమారి శ్రమదానం చేశారు. చెత్తను శుభ్రం చేసి డంపింగ్ యార్డుకు తరలించారు.

వై.రామవరం: ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు పంచాయతీల్లో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మెడికల్, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈవోపీఆర్డీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ స్థలం వైపు.. అక్రమార్కుల చూపు!

ప్రహరీ గోడ నిర్మించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తుని రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జాగా కనిపిస్తే చాలా పాగా వేస్తామన్నట్టు కొంతమంది అక్రమార్కుల తీరు ఉంది. మండలంలోని రాజుపేట గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్లో సుమారు 2.75సెంట్లు పాఠశాల గ్రౌండ్‌కి సంబంధించిన స్థలంపై కొంతమంది అక్రమార్కుల కన్ను పడింది. 2019లో నాడు-నేడు నిధులతో పాఠశాల చుట్టూ ప్రహరీ కట్టాలని అప్పటి స్కూల్ యాజమాన్య కమిటీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంకల్పించినా అదే గ్రామానికి చెందిన కొందరు నిర్మాణాన్ని అడ్డుకున్నట్టు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పుడు స్కూల్ స్థలంలో పశువులు మేసే గడ్డిమేట్లను, పశువుల మకాములను ఏర్పాటు చేయడంతో పాటుగా కొందరు భవన నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాల ప్రాంగణాన్ని సర్వే చేయించి పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి చొరవ చూపాలని కోరుతున్నారు.


అక్రమణకు గురవుతున్న రాజుపేట హైస్కూల్ స్థలం

లిబరేషన్ ఆందోళన

ప్రత్తిపాడు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్‌నగరం గ్రామంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యకర్తలు శుక్రవారం ప్రదర్శన, ధర్నా ఆందోళన నిర్వహించారు. వెంకటనగరంలో పేదలు 40ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు అధికారులకు పలు మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం గిరిజనులకు హక్కుపత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లిబరేషన్ రాష్ట్రకమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, స్థానిక రజక సంఘ నాయకుడు బండి సూరిబాబు, ముప్పిడి అప్పలకొండ, బండి రత్నం, మన్నెపల్లి వెంకటరమణ, ముప్పిడి నూకరాజు, బండి వీరబాబు తదితరులు ఉన్నారు.

పట్టాలు ఇప్పించాలని వినతి

రౌతులపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గత 15ఏళ్లుగా ఎస్.పైడిపాల గ్రామంలో సర్వే నెం1లో నైనాలమ్మ క్రింద సమీపంలో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తమకు పట్టాలిప్పించాలని డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కు గిరిజనులు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే చేయగా తాము సాగుచేసుకుంటున్న భూమి రెవిన్యూదేనని తెలిందన్నారు. గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు ఆ భూమిని ఆక్రమించుకున్నారని ఆ ఆక్రమణలు తొలగించి తమకుపట్టాలివ్వాలని వారు కోరారు.

'మద్యం దుకాణం వద్దు'

ఏలేశ్వరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా మంజూరు చేసిన మద్యం దుకాణం ఇళ్ల మధ్యలో పెట్టొద్దని 12వ వార్డుకు చెందిన ప్రజలు ధర్నా నిర్వహించారు. ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా స్పందన లేదని, దుకాణం ఏర్పాటు విరమించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో జామి ఆదినారాయణ, ఎం. సూర్యనారాయణ, కె.సింహాచలం, ఇంజరపు కృపావతి, బ్రహ్మం, సుబ్బలక్ష్మి, అమ్మాజీ, గోవిందమ్మ, గంగారత్నం,సిరిపురపు కుమారి ఉన్నారు.

మద్యం దుకాణాన్ని మార్చాలి

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నీలాద్రిరావుపేట గ్రామంలో రామభద్రయ్య చెరువు పక్కన గల ఖాళీ స్థలంలో మద్యం దుకాణానికి ఏర్పాట్లు చేస్తున్నారని దాన్ని వేరొక చోటకు మార్చాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు ఎంపీడీవో నాతి బుజ్జి, తహశీల్దార్, ఎస్ఐ, కలెక్టర్‌కు వినతి ఇచ్చారు. ఈ ప్రాంతంలో చర్చి, సచివాలయం, హెల్త్ కేర్ సెంటర్ ఉన్నాయని విద్యార్థులు ఆ దారిలోనే వెళ్లాల్సి ఉందన్నారు.

శ్రీకృష్ణ లీలలు కళా ప్రదర్శన

ప్రత్తిపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గైరమ్మ వేషాల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన శ్రీ కృష్ణ లీలలు కళా ప్రదర్శన ఆలరించింది. కృష్ణుడిగా నడబాల బాబ్జి, గోపికలుగా పక్కుర్తి పుష్ప, రాచపల్లి సత్తిబాబు, నానిపల్లి వెంకన్న, బొమ్మిడాల శ్రీనివాస్‌లు నటించారు. వారికి వస్త్రాల అలంకరణ, మేకప్ సహకారాన్ని రాయి సుబ్బారావు, దాడి శ్రీనివాస్ అందించారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలనర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డీఎస్సీ కోచింగ్‌ను వినియోగించుకోండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను గోకవరం రోడ్డులోని కాపు కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. నవీన్ మాట్లాడుతూ కోచింగ్‌ను ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తోట రవి, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, జంపన సీతారామచంద్రవర్మ, జీను మణిబాబు, జనపరెడ్డి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, అనుకూల శ్రీకాంత్, ఘా జింగం సత్తిబాబు, దాసరి సీతారామకృష్ణ, బ త్తుల సత్తిబాబు, తోలేటి సూర్యనారాయణ ఉన్నారు.


డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని జగ్గంపేట పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కె.తాతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పోస్టర్ ఆవిష్కరించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అనుకూల శ్రీకాంత్, గండేపల్లి పశు వైద్యశాల డాక్టర్ ఏసుప్రియ, మురారి పశువైద్యశాఖ డాక్టర్ ప్రగడ శ్రీనివాస్ ఉన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే


పేదలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ని ఎమ్మెల్యే యనమల దివ్య శుక్రవారం పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి స్వయంగా పేదలకు వడ్డించి నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఆమె వెంట టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే తప్పులను సరిదిద్దేందుకు చర్యలు

కోటనందూరు తహశీల్దార్ సుభాష్

కోటనందూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లో రీసర్వే తప్పులను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని తహశీల్దార్ సుభాష్ అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసర్వేలో ప్రధానంగా సమస్యలు వస్తున్నాయన్నాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డుకు స్థలాలు చూడాలన్నారు. అలాగే దీపావళి సామాగ్రి అమ్మేవారు తప్పకుండా లైసెన్సులు తీసుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామసభలు

కిర్లంపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరం గ్రామ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ గుడాల శ్రీలత అధ్యక్షతన రీసర్వే గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ చిరంజీవికి భూ సమస్యలున్న రైతులు 10 మంది అర్జీలు ఇచ్చారు. సర్వేయర్ టి.శ్రావణి, ఆర్ఐ సత్యదేవి, మండల సర్వేయర్ బషీర్, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఉన్నారు.

గండేపల్లి: తాళ్ళూరులో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. సభలో వివిధ సమస్యలపై 38 అర్జీలు వచ్చినట్టు తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండల సర్వేయర్ వై.వంశీకృష్ణ, గ్రామ సర్వేయర్లు ఎల్.భీమరాజు, పి.సతీష్, బివి ప్రసాద్, ఆర్.సతీష్, కె.మహేష్ తదితరులున్నారు.

మహిళ అదృశంపై కేసు


దాసం లక్ష్మీ (ఫైల్)

కోటనందురు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన దాసం లక్ష్మీ కోటనందూరు మండలం ఇందుగపల్లి గ్రామంలో తమ్ముడి ఇంటికి వచ్చింది. అయితే సుబ్బలక్ష్మీ గురువారం తమ్ముడు ఇంటి నుంచి ఆటోలో తుని వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో బంధువులు ఇంటి వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో శుక్రవారం ఆమె కుటుంసభ్యులు కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విజయనగరం వైపు నుంచి హనుమాన్ జంక్షన్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం గండేపల్లి జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 45 పశువులను గుర్తించి వాటిని గోశాలకు తరలించినట్టు ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

'బాణసంచా దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలి'

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జెడ్.రాగంపేట గ్రామశివారున బాణసంచా అమ్మకాలు చేపట్టే ప్రదేశాన్ని శుక్రవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, తహశీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారితో మాట్లాడుతూ దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలని. డ్రమ్ములతో నీరు, ఇసుక, ఫైర్ సేఫ్టీ తీసుకోవాలన్నారు.ఆర్ఐ సురేష్, రవికిరణ్ ఉన్నారు.

'ఓటు హక్కు నమోదు చేసుకోవాలి'

జగ్గంపేట, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిగ్రీ పూర్తయి 3ఏళ్లు గడిచిన అభ్యర్థులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతీ ఒక్కరు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో జనసైనికులు సాయంతో ప్రతి గ్రామం నుంచి అత్యధికంగా ఓట్ల నమోదుకు కృషి చేస్తామని తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ ఇంద్రజిత్



చింతూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజనులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే వెంటనే దాడి చేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఇంద్రజిత్ హెచ్చరించారు. మద్యం షాపుల నిర్వహణ విధి విధానాలను శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. బెల్టు షాపులు నడిపిస్తున్న విషయం ఏ ఒక్కరికి తెలిసినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ గదులకు చింతూరు డివిజనులో ఎటువంటి అనుమతి ఇవ్వలేదన్నారు. దుకాణాల వద్ద మద్యం సేవించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. మొత్తం ఎనిమిది షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించామన్నారు. తమ సిబ్బంది పర్యవేక్షణ నిరంతరం ఉంటుందన్నారు.

మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగుల్ మీరా



మోతుగూడెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ మానవ హక్కుల సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా డొంకరాయి గ్రామానికి చెందిన నాగుల్ మీరావలీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల సమస్యలు, హక్కుల కోసం తాను పోరాటం చేశానని చెప్పారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు, పెద్దలకు సమాచారం అందిస్తానని చెప్పారు. అనంతరం ఎంపీటీసీ కరకా వెంకటరమణను మీరావలీ మర్యాదపూర్వకంగా కలిశారు.

అఖిల భారత పశుగణన ప్రారంభం

మోతుగూడెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బొడ్డగండి పంచాయతీ గంగవాడలో 21వ అఖిల భారత పశుగణనను వెటర్నరీ అసిస్టెంట్ భద్రం ఆధ్వర్యంలో వెటర్నరీ డాక్టర్ వీరేంద్ర ప్రారంభించారు. ఎంపీటీసీ కరకా వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు సభ్యుడు నీలాపు సత్యనారాయణ, మామూరి వీర వెంకట సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ గంగిరెడ్ల గురుమూర్తి, దుంగారాజు, రైతులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి

ఏలేశ్వరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వసతి గృహాలను ప్రత్తిపాడు కోర్టు సివిల్ జడ్జి బుల్లెమ్మ తనిఖీ చేశారు. శుక్రవారం బీసీ వసతిగృహం, కళాశాల బాలికలు, బాలలు వసతి గృహాల్లో తాగునీరు, వంటశాల, హాజరు పట్టీలు, రికార్డులు, వంట సామాగ్రి, గదులు, భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులను విద్య, వసతిపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని.. తాగునీరు, వసతి గృహం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్‌లు నూకరాజు, కల్పవల్లిని ఆదేశించారు. బాలికలకు సంరక్షణగా కోసం మహిళా వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, మధు, శ్రీలక్ష్మి ఉన్నారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ఎం.నరేష్

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల హ్యుమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఎం.నరేష్ అన్నా యూనివర్శిటీ చెన్నై నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ కె.శివ నేతృత్వంలో కంపోసిట్ వెల్డింగ్ ప్రొడక్షన్ క్యారెక్టరైజేషన్ అండ్ ఫ్రిక్షన్‌స్టిర్ వెల్డింగ్ ఆఫ్ టైటానియం బొరైడ్ రేఎన్‌ఫోర్స్ అల్యూమినియం మాట్రిక్స్ కంపోసిట్స్ అనే అంశంపై ఆయన సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ పొందారని అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

తొండంగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ఏ.కొత్తపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి తొగరు పావని షణ్ముఖి తృతీయస్థానంలో నిలిచింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.2 వేల నగదు, మెమెంటో, సర్టిఫికెట్ అందుకున్నట్టు హెచ్ఎం లక్ష్మీ మాణిక్యం తెలిపారు.

సీసీరోడ్ల పనుల ప్రారంభం

గండేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో సీసీరోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం యల్లమిల్లిలో రోడ్ల నిర్మాణాన్ని పలువురు నాయకులు ప్రారంభించారు. పెనుమర్తి బాస్కరరావు, బచ్చు మల్లేశ్వరరాబు,బండి రాము తదితరులున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో మెట్టుచింత గిరిజన గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సీఐ పి.శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

